క్లుప్తంగా

10న బేతవోలు జాతరకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో కనకదుర్గమ్మ జాతర సందర్భంగా 10వ తేదీన బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే బహుజన రాజ్యాధికార ధూంధాం కార్యక్రమానికి బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు ఆ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుకూరి ఉపేందర్ శనివారం తెలిపారు. ఈ ధూం ధాం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ కమిటీ ఎన్నిక


ఇనుగుర్తి వీరాచారి


కృష్ణమాచారి

మునగాల : మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇనుగుర్తి వీరాచారి, ఉపాధ్యక్షుడిగా బాణాల మల్లాచారి, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల కృష్ణ, కోశాధికారిగా సొల్లేటి శివ, సహాయ కార్యదర్శులుగా మహేశ్వరపు వెంకటాచారి, వెలది వెంకటప్పాచారిలను ఎన్నుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు తడకమళ్ల శ్రీనివాసాచారి అభినందించారు.

12వ సారి రక్తదానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన కుర్రి శంబమ్మ అనారోగ్యంతో హైదాబాద్‌లోని బసవ తారక క్యాన్సర్ హాస్పిటల్‌లో చేరింది. దీంతో ఆమెకు శనివారం డీఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యుడు తాటి శ్రీను హాస్పిటల్‌కు వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దగ్గుబాటి బాబూరావు మాట్లాడుతూ ట్రస్ట్ తరఫున శ్రీను ఇప్పటివరకు 12వ సారి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు దంపతులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శిరిడి సాయి మందిరంలోని భోజనశాల నిర్మాణానికి మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు బండారు నాగేశ్వరరావు– జయలక్ష్మి దంపతులు శనివారం రూ.25వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు సాయి మందిర ట్రస్టు అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, శాశ్వత గౌరవ సలహాదారులు పసుపులేటి భిక్షం కృతజ్ఞతలు తెలిపారు.

ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న ఓజో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ వెంకన్న

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడు శివారులోని గాంధీనగర్ తండాలో శనివారం తిరుపతమ్మ గోపయ్యస్వామి ఇరుముడి మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజో ఫౌండేషన్ ఆధర్వంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ వెంకన్న ప్రారంభించి మాట్లాడారు. ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో మేళ్లచెరువు జాతరలో మహా అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జి శ్రీను నాయక్, గణేష్, డేవిడ్, బాల్‌రెడ్డి, వీరయ్య, పోటు వీరబాబు, వెంకట్‌రెడ్డి, సునీల్, వినోద్, వెంకటేశ్వరరెడ్డి, యాకుబ్ బాబా, ఇస్మాయిల్, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించాలి


వ్యవసాయ శాఖ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కవిత

కోదాడరూరల్ : పంటల సాగులో రైతులకు వ్యవసాయాధికారులు ఉత్తమ సేవలు అందించాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి కోరారు. శనివారం మండలంలోని గుడిబండలో వ్యవసాయ శాఖ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు వివరించి వారు లాభాల బాటలో పయనించేలా చూడాలన్నారు. రైతాంగ అభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ టి.వాసు, ఏఓ పి.రజిని, ఏఈఓలు మహేష్, చాంద్‌బీ, ఝాన్సీ, సల్మా ఉన్నారు.

ఒక్కరే సిబ్బంది.. రైతులకు ఇబ్బంది

- బేతవోలు ఉప పశువైద్యశాలలో సిబ్బంది కొరత
- 7 గ్రామాలకు ఇదే దిక్కు
- మూగ జీవాలకు అందని వైద్యం
- వైద్యశాలగా మార్చాలని కోరుతున్న జీవాల పెంపకందారులు


బేతవోలు ఉప పశువైద్యశాల

చిలుకూరు : మండలంలో మేజర్ గ్రామం అయిన బేతవోలులోని ఉప పశువైద్యశాలలో కేవలం ఒక్కరే పశువైద్య సిబ్బంది ఉన్నారు. దీంతో పశువులు, జీవాల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఉప కేంద్రం పరిధిలో బేతవోలు గ్రామంతో పాటు చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం, పోలేనిగూడెం, కొమ్ముబండ తండా, సీతరాంతండా గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో రైతులకు సుమారు 6 వేలకు పైగా పశువులు, 7 వేలకు పైగా గొర్రెలు, మేకలు ఉంటాయి. దీంతో పశువులు, జీవాలకు అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు చికిత్స నిమిత్తం ఈ ఉప పశువైద్యశాలకే తీసుకురావాల్సి ఉంటుంది. అయితే ఆ ఉప కేంద్రంలో కేవలం ఒకే ఒక పశువైద్య సిబ్బంది ఉండడంతో పశువులకు, జీవాలను సక్రమంగా చికిత్స అందడం లేదని పాడి రైతులు అంటున్నారు. అనివార్య కారణాలతో ఆ ఒక్కరు రాకపోయినా, విధుల్లో భాగంగా వేరే గ్రామం వెళ్లినా ఆ ఉప కేంద్రానికి వచ్చే పశువులకు చికిత్స చేసేవారు కానీ, టీకాలు చేసేవారు కానీ ఉండడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వసభ్య సమావేశంలో చర్చించినా..

కాగా, చిలుకూరు పశు వైద్యశాల పరిధిలో ఉన్న బేతవోలు పశువైద్యశాలలో డాక్టర్, సిబ్బంది కొరత విషయమై ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో ఆ గ్రామ ఎంపీటీసీలు వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. అయితే సిబ్బంది కొరత ఉంది కానీ ఏమి చేయలేని పరిస్థితి అని అధికారులు వివరణ కూడా ఇచ్చారు. కానీ బేతవోలు ఉప పశువైద్యశాల పరిధిలో ఒక డాక్టర్, కనీసం మూడు నుంచి అయిదుగురు సిబ్బంది ఉంటేనే వైద్యం సాధ్యమైతుంది. బేతవోలు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పశువులు, జీవాలు ఎక్కువగా ఉంటాయని రైతులు అంటున్నారు. అంతేగాక ఈ గ్రామాలకు వేసవిలో మేత కోసం వేరే ప్రాంతాల నుంచి కూడా సన్న జీవాలు వస్తాయని కావునా తక్షణమే ఈ బేతవోలు ఉప పశువైద్యశాలకు ఒక డాక్టర్‌ను నియమించి సిబ్బందిని పెంచాలని పశువులకు వైద్యం సక్రమంగా అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



బేతవోలు ఉప పశువైద్యశాలలో ఒక్కరే సిబ్బంది ఉండడంతో పశువైద్యశాల పరిధిలోని పశువులకు, సన్న జీవాలకు సక్రమంగా వైద్యం అందని మాట వాస్తవమే. ఈ గ్రామాల పరిధిలో సుమారుగా 15 వేలకు వరకు పశువులు, సన్న జీవాలు ఉంటాయి. కావున ఉప పశువైద్యశాలను పశువైద్యశాలగా మార్చాల్సిన అవసరం ఉంది. అక్కడ ఒక రెగ్యులరైజ్డ్ డాక్టర్‌ను, వైద్య సిబ్బందిని పెంచాలి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– వీరారెడ్డి, చిలుకూరు పశువైద్యాధికారి

కోదాడలో ముగిసిన ఎద్దుల పందేలు


చివరిరోజు ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు


ఎద్దుల పందేల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో లింగమంతుల స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఎద్దుల పందేలు శనివారం ముగిశాయి. గత మూడు రోజులుగా ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుట పోటీలు హోరాహోరీగా జరిగాయి. మూడవ రోజు పందేలలో విజేతలకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మల్లన్న కానుకతో పాటు దాతల సహకారంతో నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఆరు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లాకు చెందిన వజ్రాల తేజస్వీరెడ్డికి చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలువగా వారికి పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు రూ.30వేల నగదు ఇవ్వగా ఎమ్మెల్యే వారికి అందజేశారు. ద్వితీయ స్థానంలో పల్నాడు వినుకొండకు చెందిన బత్తుల పద్మావతియాదవ్ ఎద్దులు నిలువగా వారికి ఖానాపురం సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు రూ. 30వేల నగదు అందజేశారు. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమ్మిడి అంజయ్య చౌదరి ఎద్దులు తృతీయ స్థానంలో నిలువగా వీరికి వెలిశాల రాణాప్రతాప్ రూ.20వేల నగదు అందజేశారు. పల్నాడుకు చెందిన కంభంపాటి శ్రీనివాసరావు ఎద్దులు నాలుగో స్థానంలో నిలువగా కౌన్సిలర్ చంద్రశేఖర్ రూ.15వేలు అందజేశారు. పల్నాడు జిల్లాకు చెందిన ముంద్ర మల్లయ్య బ్రదర్స్‌కు చెందిన ఎద్దులు ఐదవ స్థానంలో నిలువగా వారికి కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు రూ.12వేలు అందజేశారు. కోదాడ మండల రామలక్ష్మీపురంనకు చెందిన హేమలతాశ్రీనివాసరెడ్డి ఎద్దులు ఆరవ స్థానంలో నిలువగా వారికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు గంధం పాండు రూ.10 వేలు అందించారు. ఏడవ స్థానంలో పల్నాడుకు చెందిన ఏరువ కీర్తనరెడ్డి నిలువగా రూ.8వేలను మేళ్లచెర్వు శ్రీలత రాంప్రసాద్‌లు అందజేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన నల్లూరి శ్రీనివాసరావుకు చెందిన ఎద్దులు ఎనిమిదవ స్థానంలో నిలువగా వారికి కోదాడకు చెందిన భోగాల కోటిరెడ్డి రూ.6వేలు అందించారు. కాగా ఉదయం ఎద్దుల పందేలను కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఎద్దుల పందేల నిర్వహాక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను రక్షించాలి


మాట్లాడుతున్న దుశ్చర్ల సత్యనారాయణ

మోతె : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ప్రకృతి సంపద రక్షించాలని, పక్షులు, మూగ జీవాలపై ప్రేమ కలిగి ఉండాలని జలసాధన సమితి ఉద్యమ నేత దుశ్చర్ల సత్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని మామిళ్లగూడెంలో శ్రీవెంకటేశ్వర విద్యా సంస్థల ప్రగతి వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనుషులు ప్రకృతి వనరులను వినియోగించుకోవాలి తప్ప వాటికి నష్టం చేయవద్దన్నారు. విద్యార్థులు పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థానానికి చేరాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక దృక్పథాన్ని కలిగి ఉండి, దేశ రక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల విద్యాధికారి గోపాల్‌రావు మాట్లాడుతూ.. 1993లో స్థాపించిన శ్రీవెంకటేశ్వర విద్యాలయం నేటితో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యాలయ యాజమాన్యాన్ని అభినందించారు. గ్రామీణ స్థాయి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ఘనంగా సన్మానించారు. తదనంతరం వారోత్సవాల సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జానిమియా, డీన్ హజారుద్దీన్ మహమ్మద్, డైరెక్టర్ సయ్యద్‌మియా, మాజీ సర్పంచ్ జానిపాష, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నగట్టు జాతర చూద్దాం రండి

- అమరవరంలో నేటిరాత్రి నుంచి లింగమంతులస్వామి జాతర
- 6న పూజలు, అభిషేకం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


లింగమంతులస్వామి జాతరకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, కమిటీ సభ్యులు


ముస్తాబైన లింగమంతులస్వామి ఆలయం


స్వామివారి మూల విరాట్

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామ శివారులో గల చిన్నగట్టు (లింగమంతులస్వామి) జాతరకు అంతా సిద్ధం చేశారు. యాదవుల ఆరాధ్య దైవమైన లింగమంతులస్వామి జాతరను పెద్దగట్టు జాతర మాదిరిగానే మూడు రోజుల పాటు ఈ జాతరను గ్రామంలోని యాదవ కులస్తులతో పాటు గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

6న ముద్దెరపోలు, జాతర..

కాగా జాతరలో భాగంగా ఆదివారం రాత్రి 8 గంటలకు ఆయుధాలు, బోనాలు, గంపలతో యాదవులు, గ్రామప్రజలు ఊరేగింపుగా లింగమంతులస్వామి గట్టు మీదకు చేరుకుంటారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి పూజలు నిర్వహిస్తారు. 6వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారికి పూజా కార్యక్రమాలు, అభిషేకం, నైవేద్యం సమర్పించి ముద్దెరపోలు, మధ్యాహ్నం జాగిలాలు పోయుట, 7వ తేదీ చంద్రపట్నం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక జాతర సందర్భంగా ఇప్పటికే ఆలయ నిర్వహకులు ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ముస్తాబు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా జాతరకు పక్కనే ఉన్న ఏపీలోని పల్నాడు జిల్లాతో పాటు కృష్ణా, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా కబడ్డీ, కోలాట ప్రదర్శనలతో పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మా గ్రామంలో యాదవ కుల ఆరాధ్య దైవమైన చిన్నగట్టుపై ఉన్న లింగమంతులస్వామి జాతరకు వచ్చే భక్తులకు మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తి చేశాం. దుకాణాలు, ప్రభలు ఏర్పాటు చేసుకునే వారికి, వాహనాలకు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.
– అమరబోయిన మట్టయ్య, ఆలయ కమిటీ చైర్మన్, అమరవరం

వైభవంగా సుదర్శన హోమం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, కలషాభిషేకం, బలిహరణ, విష్ణు సహస్రనామార్చన, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. కాగా ఈనెల 5న శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ లక్ష్మణ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరగిరినాథుని క్రిష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, యాజ్ఞికులు సాయికుమారాచార్యులు, ఆలయ మాజీ చైర్మన్ మద్ది హుస్సేన్‌రెడ్డి, రమాదేవి, వీరయ్య, వీరారెడ్డి, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోపాలక్రిష్ణ, భక్తులు పాల్గొన్నారు.

24గంటల విద్యుత్ సరఫరాలో విఫలం

నేరేడుచర్ల : రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కానీ రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, రైతు సంఘం మండల అధ్యక్షుడు కత్తి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు రేయింబవళ్లు పొలాల వద్ద కాపాల కాయాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి 4 గంటలే విద్యుత్ అందుతుందని, కనీసం 12గంటలు అయినా విద్యుత్ సరఫరా చేస్తే పంటలు చేతికి వస్తాయని అన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సీపీఐ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు వెంకన్న తదితరులున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని తుంబాయిగడ్డ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. పలువురు విద్యార్థులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భార్గవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, వెంకటేశ్వర్లు, చైర్మన్ హేమంత్, ఉపాధ్యాయులు మానస, స్వర్ణలత, రాంబాబు, స్వాతి తదితరులున్నారు.

నేడు స్వామివారి కల్యాణ మహోత్సవం


శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి 11గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొంతు మోహన్‌రావు శనివారం తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ హాజరు కానున్నట్లు తెలిపారు. అలాగే ఆదివారం రాత్రి ఆలయం అవరణలో గ్రామానికి చెందిన అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన బండారు కవిత

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం కోదాడకు చెందిన సర్వేజన ఫౌండేషన్ చైర్ పర్సన్ బండారు కవితారెడ్డి డిజిటల్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల సైన్స్ ఫెయిర్‌లో దక్షిణ భారత స్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన ఉపాధ్యాయుడు షేక్ జాఫర్, రాష్ట్ర స్థాయి అవార్డు పొందిన ఉపాధ్యాయురాలు వై.చంద్రజ్యోతిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బండారు అమరేందర్‌రెడ్డి, సభ్యులు ఎం.లక్ష్మీనరసింహారెడ్డి, ప్రసాద్, నారాయణరెడ్డి, మునగాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు దండు సీతరామరాజు, హెచ్‌ఎం రాములునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలి

మోతె : శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలని బీజేపీ వాణిజ్య సెల్ జిల్లా కన్వీనర్ వంగవీటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా శక్తి కేంద్రాలను ఈ నెల 10 నుంచి 25 వరకు రాష్ట్ర నాయకులు సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో బానోతు శ్రీనునాయక్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి ఉప్పుల రామచంద్రయ్య, మండల ఉపాధ్యక్షుడు కొడిసె వెంకన్న, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొత్త ధర్మారెడ్డి, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు బొంత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్ : ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం హుజూర్‌నగర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలు, సరుకులను రవాణా చేయడంలో ట్రాన్స్‌పోర్టు కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కార్మికులను, కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇందిరా పార్క్ ధర్నాకు ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు గోపి, చందు, వెంకన్న, బాబా, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ముస్తాబు


పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో కొనసాగుతున్న శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీసీతారామచంద్రస్వామి వారిని కల్యాణానికి పెండ్లి బట్టలతో ముస్తాబు చేశారు. అనంతరం అళ్వారులను పల్లకీలో ఉంచి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. గోదాదేవి, ఉభయ దేవేరులైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వాములను వివిధ వాహనాలలో భక్తులే బోయిలుగా గట్టు మీదకు తీసుకొచ్చారు. గట్టుపై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం యాగశాలలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, అర్చకులు, స్థానాచార్యులు, అభివృద్ధి సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బేతవోలు బీఆర్‌ఎస్‌లో 'కోలాటం' పంచాయితీ

- 9 నుంచి కనకదుర్గమ్మ జాతర
- కోలాట ప్రదర్శనకు స్థలం కోసం పోటీ పడుతున్న ఇరువర్గాలు
- మరోమారు బయటపడ్డ విభేదాలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఈ నెల 9, 10, 11 తేదీల్లో గ్రామంలో కనదుర్గమ్మ జాతర సందర్భంగా వివిధ పార్టీల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన నిర్వహించనున్నారు. అయితే ఏ పార్టీల వారు గ్రామంలోని ఏ ప్రదేశంలో కోలాట ప్రదర్శన, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలో 10 ఏళ్ల క్రితమే గ్రామ పెద్దల సమక్షంలో పోలీసులు శాంతి కమిటీ ఏర్పాటు చేసి తీర్మానించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ వారు బస్టాండ్ సెంటర్, సీపీఐ గ్రామ పంచాయతీ పక్కన, బీఆర్‌ఎస్ వారు రథశాల సెంటర్ పక్కన, సీపీఎం ప్రాథమిక పాఠశాల వద్ద, టీడీపీ జెడ్పీ హైస్కూల్ దగ్గర గల ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నారు. గత ఏడాది వైఎస్సార్‌టీపీ వారు బస్టాండ్‌కు దగ్గరలో నూతనంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇక బేతవోలు బీఆర్‌ఎస్‌లో రెండు వర్గాలు ఏర్పడడంతో వీరికి కేటాయించిన స్థలంలో మేము నిర్వహిస్తామంటే మేం అంటూ పార్టీలోని రెండు వర్గాలు పోటీపడుతున్నాయి. దీంతో ఈ వ్యవహారం వివాదంగా మారింది.

డీఎస్పీ హెచ్చరిక..

కాగా బేతవోలులో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నియమించిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రథశాల వద్ద కోలాటం వేయాలని చూస్తుండగా, పార్టీలోని మరోవర్గం అయిన సర్పంచ్ వట్టికూటి చంద్రకళనాగయ్య, ఎంపీటీసీ వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబులు కూడా అక్కడే కోలాట ప్రదర్శన చేస్తామని అంటున్నారు. దీంతో కోలాట ప్రదర్శన స్థలం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో శనివారం గ్రామంలోకి వచ్చిన కోదాడ డీఎస్పీ జాతర శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. డీఎస్పీ ముందు బీఆర్‌ఎస్‌లో ఇరువర్గాల నాయకులు తమ వాదానాలు వినిపించారు. కాగా జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే వట్టికూటి నాగయ్య వర్గం వారు రథశాల సెంటర్ వద్ద కాకుండా గ్రామ పంచాయతీ పక్కన పెట్టాలని కోరగా అక్కడికి దగ్గరలో ప్రదర్శన ఏర్పాటు చేసుకునే సీపీఐ నాయకులు నిరాకరించినట్లుగా తెలిసింది. దీంతో కోలాటం ప్రదర్శన ప్రదేశం వివాదం రగులుతూనే ఉంది. కావున పోలీసులు జోక్యం చేసుకొని బేతవోలులో కనకదుర్గమ్మ జాతర శాంతియుతంగా జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

నలబోలు అంతమ్మకు నివాళి

మునగాల : మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నలబోలు కోటిరెడ్డి తల్లి నలబోలు అంతమ్మ దశదిన కర్మను శనివారం గ్రామంలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మత రెడ్డి శశిధర్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీల నాయకులు కన్మతరెడ్డి వెంకట్రాంరెడ్డి, భిక్షంరెడ్డి, శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు రాయి రవి, యుగంధర్, సుంకర్ శ్రీనివాస్, లక్యా నాయక్, లింగయ్య, దున్న ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సుకన్య, సమృద్ధి యోజన పథకాలపై ప్రచారం

నడిగూడెం : మండల కేంద్రంలో సుకన్య, సమృద్ధి యోజన పథకాలపై శనివారం తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పది ఏళ్ల వయస్సు కలిగిన ఆడపిల్లలకు ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవడం కోసం పోస్టు ఆఫీసులో దరఖాస్తు పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్ పోస్టుమాస్టర్ భానుశ్రీ, సిబ్బంది వీరబాబు, షరీఫ్, శరత్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బహూకరణ

కోదాడరూరల్ : మండలంలోని ఎర్రవరంలో వెలిసిన బాల ఉగ్రనరసింహస్వామి ఆలయానికి వనపర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఐదు వందల లీటర్ల వాటర్ ట్యాంకర్‌ను బహూకరించినట్లు ట్రస్ట్ చైర్మన్ వనపర్తి లక్ష్మీనారాయణ తెలిపారు.

గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే)ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శాంతకుమారి ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ వెంకట్రావు ఆదేశాల మేరకు గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు.

పశువైద్య శిబిరం

గరిడేపల్లి : మండలంలోని కోదండరాంపురం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ వెన్న రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. దూడలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగేంద్ర, శ్రీకాంత్, సురేష్, ఉప సర్పంచ్ మచ్చ రమేష్‌రెడ్డి, మంద భిక్షం, మట్టయ్య తదితరులున్నారు.

బియ్యం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణ శివారులోని ఫణిగిరి గట్టు సమీపంలో మోడల్ కాలనీ వద్ద నివాసం ఉంటున్న చల్లా వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా శనివారం వారి కుటుంబాన్ని కౌన్సిలర్లు గుంజ భవాని, ఓరుగంటి నాగేశ్వరరావు, యడ్ల విజయ్‌లు పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. నాయకులు జె.వెంకన్న, ఎస్.రామకృష్ణ, ఎం.నాగేశ్వరరావు, కె.గోపి, ఎం.బాలకృష్ణ, వి.శ్రీను, ఆర్.హరి తదితరులు పాల్గొన్నారు.